క్లుప్తంగా

నాయకుల విగ్రహాలకు ముసుగులు



శ్రీకాళహస్తి : ముసుగు వేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పట్టణవ్యాప్తంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు మున్సిపల్ అధికారులు ముసుగులు వేశారు. పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి, రాజీవ్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగులు తొడిగారు. పట్టణ వ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. మహాశివరాత్రికి ఏర్పాటు చేసిన దేవస్థానం ఫ్లెక్సీలను కూడా తొలగించారు.

ఫ్లెక్సీల తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండల కేంద్రంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తహసీల్దారు పటాన్ మహ్మద్ ఆలీఖాన్ తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఆదివారం 'కోడ్ వచ్చినా తొలగని పోస్టర్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు.

సత్యవేడులో..

సత్యవేడు: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ముందు, కూడళ్లలో ఏర్పాట్లు చేసిన రాజకీయ పార్టీల పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు, జెండాలను తొలిగించారు. ఆదివారం సాయంత్రం తహసీల్దార్ రామాంజనేయులు సిబ్బందితో కలసి పట్టణంలో ఎక్కడా పార్టీల బ్యానర్లు లేకుండా చర్యలు చేపట్టారు.

నిబంధనలు బేఖాతార్

నాగలాపురం: సార్వత్రిక ఎన్నికల కోడు అమలులోకి వచ్చినా జనసేనా పార్టీ బోర్డులు దర్శనమిస్తూనే ఉన్నాయి. స్థానిక టవర్ క్లాక్ కూడలి వద్ద జనసేన పార్టీకి చెందిన బోర్డులు దర్శనమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

సిపాయి భరోసా అందజేత



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో మన్నసముద్రం జంగారెడ్డి కుటుంబానికి ఆదివారం సిపాయి భరోసా అందింది. జంగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబ పరిస్థితులు తెలుసుకుని రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఆదివారం ఆగ్రామానికి వెళ్లారు. సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 40 రకాల వస్తువులను అందజేశారు. నాయకులు రత్నం, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, కిట్టుమేస్త్రీ, శివ తదితరులు పాల్గొన్నారు.

500 మద్యం బాటిళ్ల సీజ్

- ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పిచ్చాటూరు: మండలంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 500 బాటిళ్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. వెంగళత్తూరు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నగరి వైపు వెళుతున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో పాండిచ్చేరికి చెందిన 500 మద్యం బాటిళ్లు ఉన్నాయి. ఆటో సహా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న జగదీష్, వేలును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని మర్రిమందలో దాడి ఘటనకు సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఆదివారం రాత్రి తెలిపారు. వివరాలు.. మర్రిమంద ఎస్సీ కాలనీకి చెందిన మునలిపేడు భూలక్ష్మిపై అదే కాలనీకి చెందిన బాలకృష్ణ, హేమలత, చందు, దినేష్, కుమారస్వామి, జగదీష్, నీలమ్మ దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

స్కూటరిస్ట్‌కు గాయాలు

మండలంలోని కోబాక సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ గాయపడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. కోబాక గ్రామానికి చెందిన సుధాకర్ నాయుడు(42) ద్వి చక్ర వానంపై ఏర్పేడుకు వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. కోబాక సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుధాకర్ నాయుడుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జగనన్నకు తోడుగా నిలుద్దాం

- పేదల బతుకులు మార్చిన సీఎం
- 30 ఏళ్లు బొజ్జల కుటుంబం చేసిందేమీ లేదు
- ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి



తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: నాలుగున్నరేళ్ల పాలనలో పేదల బతులను బాగు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దామని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని బియ్యపు శ్రీవాణిరెడ్డి కోరారు. ఆదివారం తొట్టంబేడు మండలం బసవన్న గుంట, కత్తివారికండ్రిగ, తంగేళ్లపాళెం, తంగేళ్ల పాళెం ఎస్టీ కాలనీ, దళితవాడలో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. 30ఏళ్లు శ్రీకాళహస్తిని పాలించిన బొజ్జల కుటుంబం అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. శ్రీకాళహస్తిని అభివృద్ధిపథంలో నడిపించిన బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే ఆదర్శంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. కరోనా వంటి కష్టకాలంలో కనిపించకుండా హైదరాబాద్‌లో తలదాచుకున్న వారు ఎన్నికలకు రెండు నెలల ముందొచ్చి కపట ప్రేమ చూపి ఓట్లు అడుగుతున్నారని వివరించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మీ ఇంటి మనిషిగా తోడుగా ఉన్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, కత్తి నాగరాజు, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, నాయకులు ప్రతాప్, రంగయ్య, గురవయ్య, సుధాకర్, కిరణ్, కన్నలి భాస్కర్‌రెడ్డి, కోవి చంద్రయ్యనాయుడు, వెంకీ, జగదీశ్వరరెడ్డి, శ్రీనివాసులు, గంగాధరం, శంకరయ్య, మణి, గురవారెడ్డి, సునీత, భూలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న శ్రీవాణిరెడ్డి

అశోకరాజుకు మాతృ వియోగం



నరసమ్మ(ఫైల్)

నారాయణవనం: స్థానిక సిద్దార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ అశోకరాజు తల్లి నరసమ్మ(82) శనివారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తిరుపతిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. సోమవారం ఉదయం స్వగ్రామమైన విజయపురంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



అశోకరాజును పరామర్శిస్తున్న మంత్రి రోజా

మంత్రి ఆర్కే రోజా పరామర్శ


విజయపురం : సిద్దార్థ కళాశాలల చైర్మన్ అశోకరాజును మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. ఆదివారం విజయపురం వెళ్లి అశోక్‌రాజు తల్లి నరసమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వెంట ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, నార్పరాజు, శివరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

మల్లవరం టు కశ్మీర్... మన మస్క్‌మెలన్

- మల్లవరం కర్భూజాకు జమ్మూలో భలే డిమాండ్
- మల్చింగ్ షీట్, డ్రిప్ సబ్సిడీ పరికరాలతో ప్రభుత్వ ప్రోత్సాహం
- టన్నుకు రూ.20వేలకు పైగా చెల్లింపులు
- ఎకరం 14–18టన్నులు దిగుబడి
- ఎకరం రాబడి రూ.2.80 నుంచి రూ.3.20లక్షలు



రేణిగుంట మండలం మల్లవరంలో సాగుచేసిన తెల్ల కర్భూజా పంట



మల్లవరం నుంచి జమ్మూకశ్మీర్‌కు ఎగుమతి చేస్తున్న మస్క్‌మెలన్(తెల్లకర్భూజా)

తిరుపతి అర్బన్: పంటల సాగుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. విత్తనాలు, ఎరువులు రాయితీలతో పంపిణీ చేయడం నుంచి ధాన్యం కొనుగోలు చేయడం వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకున్నట్లు పనిచేస్తోంది. రైతులకు పెట్టుబడిగా వైఎస్ఆర్ రైతు భరోసా, నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు ప్రమాద బీమా ప్రభుత్వం ప్రీమియం చెల్లించి అండగా నిలుస్తోంది. రాయితీలతో ట్రాక్టర్లు, వరికోత యంత్రాలకు చెందిన పనిముట్లు అందిస్తోంది. వ్యవసాయ రంగంతోపాటు ఉద్యాన శాఖ, మైక్రో ఇరిగేషన్, మత్స్యశాఖ. ఉద్యానశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

- **సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా నీటి ఆదా కోసం బిందు సేద్యం(డ్రిప్), స్ప్రింక్లర్లు(తుంపర్లు)తో పంటలు పండించడానికి రెండేళ్ల కాలంలో 90శాతం రాయితీలతో 8వేల ఎకరాలకు వివిధ పరికరాలను జిల్లాలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందించింది.**

జమ్మూకశ్మీర్‌కు...

మల్లవరం నుంచి మస్క్ మెలన్ ఎగుమతి సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా రేణిగుంట మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన లోకారెడ్డి ఆనే రైతు మస్క్ మెలన్(తెల్లకర్భూజా)పంటను ఐదు ఎకరాల్లో సాగుచేశారు. ఎకరం సాగుకు రూ.1.10 లక్షల చొప్పున ఐదు ఎకరాలకు రూ.5.50లక్షలు ఖర్చుచేశారు. అయితే తెల్లకర్భూజాకు జమ్మూకశ్మీర్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఏపీలోని తెల్లకర్భూజాను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.14 వేలు రేటుతో కొనుగోలు చేశారు. దీంతో ఎకరానికి రూ.2.80లక్షలు చొప్పున ఐదు ఎకరాలకు రూ.14 లక్షలు రాబడి చేకూరింది.

ప్రభుత్వ సాయంతోనే ప్రయోజనం..



రాష్ట్ర ప్రభుత్వ సాయంతోనే తెల్ల కర్భూజాను సాగు చేశాం. అవసరం అయిన మేరకు మా ఐదు ఎకరాల్లో పంటలు సాగు చేయడానికి నీళ్లు లేవు.అయితే నీటి ఆదా కోసం 9 0శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను అందించారు. దీనికి తోడు పంట దిగుబడి బాగా వచ్చింది. జమ్మూకశ్మీర్‌లో మంచి డిమాండ్ ఉండడంతో టన్ను రూ.20 వేలు ధర పలికింది. దీంతో మంచి రాబడి వచ్చింది. ప్రభుత్వం చేసిన సాయంతో రైతులు సంతోషంగా ఉన్నారు.

– లోకారెడ్డి, మల్లవరం గ్రామం, రైతు

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే లక్ష్యం



ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌ను సత్కరిస్తున్న నేతలు

వరదయ్యపాళెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఆదివారం వరదయ్యపాళెంలో జరిగిన పార్టీ నాయకుడు లోకేష్ ఇంటి వద్ద నాయకులతో వారు ఆత్మీయ సమావేశమయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో మండలానికి తొలిసారిగా వచ్చిన మద్దెల గురుమూర్తి, నూకతోటి రాజేష్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. వారి వెంట పార్టీ తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, నాయకులు భానుప్రకాష్ రెడ్డి, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, ప్రచార కార్యదర్శి చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, యూత్ కన్వీనర్ వినోద్‌కుమార్ యాదవ్, పార్టీ నాయకులు రమణయ్య, గిరిరెడ్డి, శోభన్ యాదవ్, నాగరాజు, పృథ్వీరవి తదితరులు ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధికే మళ్లీ పట్టం కట్టండి



సరస్వతికండ్రిగలో పథకాల లబ్ధిని వివరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

- రైతు శ్రేయస్సే జగనన్న ధ్యేయం
- ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సరస్వతికండ్రిగ పంచాయతీలోని సరస్వతికండ్రిగ, రాజుపాలెం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న పేద, మధ్యతరగతికి చెందిన మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు పలు పథకాలు అమలు చేశారని తెలిపారు.

రైతుల కోసం సబ్సిడీలు

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకు రైతుల కోసం రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం, ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ పరికరాలు, హార్వెస్టర్లు వంటివి సబ్సిడీపై ఇస్తున్నట్లు చెప్పారు. కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపినా ఎక్కడా రాజీపడకుండా పథకాలు కొనసాగించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జమళ్ల శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, చల్లా సుబ్రమణ్యం యాదవ్, లోకనాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, గుణశేఖర్ నాయుడు, మునగారెడ్డి, శేఖర్, మయూరమ్మ, మునిరత్నం నాయుడు, జీపీ యాదవ్, సురేఖ, సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి

26 నుంచి బ్యాంకు కార్మికుల సమ్మె

నారాయణవనం : అంచలవారీగా సమ్మెకు దిగనున్నట్లు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉమ్మడి చిత్తూరు, కృష్ణ జిల్లాల్లో దినసరి వేతనానికి పనిచేస్తున్న క్యాజువల్ కార్మికుల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. బ్యాంకు యాజమాన్యం కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ ఈనెల 26వ తేదీ నుంచి దశలవారీగా నిరసన తెలుపుతూ ఏప్రిల్ 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి దిగుతామని తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు శివరాం బాబు, ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆదివారం నారాయణవనంలో మీడియాతో మాట్లాడారు. రోజుకు రూ. 60 నుంచి వేతనం తీసుకుంటూ బ్యాంకు పురోగతికి మెసెంజర్లుగా, అంటెండర్లుగా పనిచేస్తున్నామని అన్నారు. కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో యాజమాన్యం అవుట్‌సోర్సింగ్ కింద కార్మికులను నియమించుకునేందుకు ఏజెన్సీల నుంచి టెండర్లను ఆహ్వానించిందని తెలిపారు. టెండర్లను రద్దు చేసి, ఈనెల చివరిలో కోర్టు ఇవ్వనున్న తీర్పును అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

సమాజ హితమే బ్రహ్మకుమారి సమాజం లక్ష్యం



మాట్లాడుతున్న పాలకమండలి చైర్మన్

శ్రీకాళహస్తి: సమాజ హితమే లక్ష్యంగా ప్రజాపిత బ్రహ్మకుమారి సమాజం పనిచేస్తోందని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళావేదిక ప్రాంగణంలో రుద్రాక్షలతో తయారు చేసిన శివలింగం, నందీశ్వరుని ప్రతిమలను బ్రహ్మకుమారి సమాజం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంచడంతోపాటు రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేస్తోందన్నారు.అనంతరం చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య రూపకం

త్వరలో కార్యాచరణ తెలియజేస్తా

శ్రీకాళహస్తి: పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని, త్వరలో కార్యాచరణ తెలియజేస్తానని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే అభ్యర్థినిగా టికెట్ రాకపోయినా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతానని తెలిపారు. పవన్ కల్యాణ్ పిలుపు తరువాత పార్టీ కార్యకర్తలతో అధినేత సందేశాన్ని తెలిపి తదుపరి కార్యాచరణ తెలియజేస్తానని అన్నారు. అనంతరం ఆమె భర్త కోట చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ వచ్చినందుకు బొజ్జల సుధీర్‌రెడ్డి పొత్తుధర్మం పాటించాలన్నారు. తమ కార్యకర్తలను ఇబ్బంది పెడితే మీరే నష్టపోతారని హెచ్చరించారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో భువనేశ్వరి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ పరిధిలో 2,295 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఎంజీఎం కేంద్రంలో 270మంది, శ్రీచైతన్య కేంద్రంలో 250మంది, సరస్వతిబాయి పాఠశాల కేంద్రంలో 180మంది, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఏ, బీ కేంద్రాల్లో 420మంది, బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 175మంది, బాబుఅగ్రహారం పాఠశాల కేంద్రంలో 200మంది, భాస్కరపేట పాఠశాల కేంద్రంలో 200మంది, నారాయణ పాఠశాల కేంద్రంలో 200మంది, ఏపీటీడబ్ల్యూఎస్ బాలికల పాఠశాల కేంద్రంలో 180 మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణ పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఏ, బీ పరీక్ష కేంద్రాల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు లక్ష్మయ్య, సంబంధశెట్టి తెలిపారు. మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నతపాఠశాల్లో, 3 ప్రైవేటు పాఠశాలల్లో 398 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగ: స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం చేసిన ప్రశ్నపత్రాలు



పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష గది

బుచ్చినాయుడు కండ్రిగలోని జెడ్పీ హైస్కూల్(ఏ కేంద్రం)లో 200 మంది, బీ కేంద్రంలో 198 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారులుగా ఆదిశేషయ్య, రమణయ్య వ్యవహరిస్తారని పేర్కొన్నారు. తాగునీటి సౌకర్యంతోపాటు వైద్య సిబ్బంది అందుబాటు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరాయి. పరీక్షల చీఫ్‌లు, డిపార్టుమెంట్ అధికారులు పశ్నపత్రాల కట్టలను పరిశీలించి, బాక్స్‌ల్ల భద్రపరిచి పోలీసుస్టేషన్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు విద్యా శాఖ అధికారులు పగడ్బందీ ఏర్పాట్లు నిర్వహించారు. ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 87 మంది, పల్లం పాఠశాలలో 115 మంది, పంగూరులో 78 మంది, పాపానాయుడుపేటలో 97 మంది, బండారుపల్లిలో 26 మంది, కందాడులో 55 మంది, మునగలపాలెంలో 50 మంది, వ్యాసాశ్రమంలోని ఎయిడెడ్ పాఠశాలలో 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఏర్పేడు, పాపానాయుడుపేట, పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. డెస్కులు, తగినంత వెలుతురు. విద్యుత్, తాగునీటి వసతి, వైద్య సేవలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ప్రేమలత చెప్పారు.



సత్యవేడు.. బాలుర హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్

సత్యవేడు మండలంలో..

సత్యవేడు: పట్టణంలోని ప్రభుత్వం బాలుర ఉన్నత పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, బాలుర గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలకు రెగ్యులర్, ప్రవేటు విద్యార్థులు 686 మంది హాజరవుతున్నట్లు ఎంఈఓ కె.రవి తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 205మంది, బాలికల గురుకులంలో 224, బాలుర గురుకులంలో 257 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 8.45 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని చెప్పారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించమన్నారు.

ఆల్ ది బెస్ట్

శ్రీకాళహస్తి: పదవ తరగతి విద్యార్థులకు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పట్టుదలతో చదవాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు ఆయన ఆల్‌ది బెస్ట్ తెలిపారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంటూ బాగా చదవాలన్నారు.



మధుసూదన్‌రెడ్డి